www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 14 మే 2023

త్రిబుల్ ఐటి విద్యార్థులకు 14 నుండి వేసవి సెలవులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



రాష్ట్రంలోని ఆర్‌జెయుకెటి పరిధిలోని శ్రీకాకుళం త్రిబుల్ ఐటి, ఒంగోలు, నూజివీడు, ఇడుపులపాయ త్రిబుల్ ఐటి విద్యార్థులకు ఈనెల 14వ తేదీ నుండి జూన్ నాలుగో తేదీ వరకూ వేసవి సెలవులు ప్రకటించినట్లు నూజివీడు త్రిబుల్ ఐటి కార్యాలయ సిబ్బంది తెలిపారు. తిరిగి జూన్ ఐదో తేదీ నంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. విద్యార్థులందరూ దూర ప్రాంతాల్లోని తమ ఇళ్లకు చేరుకోవడానికి క్యాంపస్ వద్ద నుండి ఆర్‌టిసి బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మూగ రోదన..!

అకాల వర్షాలతో తడిసి ముద్దయిన గడ్డి
జాగ్రత్త చేసుకునే అవకాశం దక్కని రైతులు
రెండు జిల్లాల్లో తొమ్మిది లక్షలకుపైగా గేదెలు, ఆవులు
ప్రతిరోజూ లక్షా 50 వేల లీటర్లకుపైగా పాల ఉత్పత్తి
ఎండుగడ్డి కొరతతో పశుపోషణపై రైతులకు అగమ్యగోచరం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అకాల వర్షాలు అన్నదాతను అన్నిరకాలుగా ఇబ్బందులకు గురిచేశాయి. ఇప్పటికే ఆరుగాలం కష్టపడి పండించిన రబీ పంట తడిచి ముద్దవ్వడంతో అన్నదాత కష్టాలు వర్ణనాతీతం. వర్షాలకు యంత్రాలతో కోత అనంతరం పొలాల్లో ఉన్న ఎండుగడ్డి మొత్తం తడిసి ముద్దవ్వడంతో రైతులకు ఏంచేయాలో పాలుపోని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో తొమ్మిది లక్షలకుపైగా పశువులు ఉన్నాయి. వీటిలో ఏలూరు జిల్లాలో గేదెలు నాలుగు లక్షలు, ఆవులు రెండు లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో మూడు లక్షల వరకూ గేదెలు, ఆవులు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రతిరోజూ ఏలూరు జిల్లాలో లక్షా 15 వేల లీటర్ల వరకూ పాల ఉత్పత్తి జరుగుతుండగా, పశ్చిమలో 50 వేల లీటర్లకుపైగా పాల ఉత్పత్తి జరుగుతున్న పరిస్థితి ఉంది. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడంతో పాల ఉత్పత్తితోనే రైతుల జీవనం ముందుకు సాగుతోంది. తవుడు, చిట్టు వంటి దాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయి. ఆక్వా చెరువులు పెరిగిపోవడంతో పచ్చిగడ్డి సైతం తీవ్ర ఇబ్బందిగా మారింది. రైతులు అత్యధికంగా ఎండుగడ్డిని పశువులకు ఉపయోగిస్తారు. గతంలో కూలీలతో కోతలు, నూర్పిళ్లు చేసినప్పుడు జిల్లాలో ఎండుగడ్డికి కొరత ఉండేది కాదు. జిల్లాలో ఖరీఫ్, రబీల్లో దాదాపు పది లక్షల ఎకరాల్లో వరిసాగు సాగుతోంది. దీంతో ఎండుగడ్డికి రైతులకు ఇబ్బంది అనేది పెద్దగా లేకుండా లేని పరిస్థితి ఉండేది. మిషన్ కోతలు వచ్చిన తర్వాత ఎండుగడ్డి కొరత వేధిస్తున్న పరిస్థితి సాగుతోంది. దీంతో యంత్రాలతో కోత కోసిన తర్వాత పొలంలో పడి ఉన్న గడ్డిని జాగ్రత్త చేసి రైతులు పశువులకు వినియోగిస్తున్నారు. ఖరీఫ్‌లోనూ వర్షాలతో ఎండుగడ్డిని రైతులు పెద్దగా జాగ్రత్త చేసుకోలేని పరిస్థితి ఉంది. ప్రస్తుత రబీలో అకాల వర్షాలు విరుచుకుపడటంతో మిషన్ కోత కోసిన తర్వాత పొలాల్లో ఉన్న గడ్డి తడిచిముద్దయిపోయింది. వర్షాలకు నేలకొరిగిన పొలాల్లో గడ్డి పని చేయని దుస్థితి నెలకొంది. ప్రతియేటా రెండు, మూడు పశువులు ఉన్న రైతులు రెండు ట్రాక్టర్ ట్రక్కుల గడ్డిని నిల్వ చేసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండాపోయింది.

పశుపోషణ సాగేదెలా..

ఎండుగడ్డి సమస్య ఏర్పడటంతో రైతులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది. ఏడాది పొడవునా పశుపోషణ ఎలాగో ఆందోళన వారిని వెంటాడుతోంది. దాణా, పచ్చిగడ్డి కొనుగోలు చేసి పశుపోషణ అంటే పెద్దఎత్తున ఖర్చుతో కూడుకున్న పని. ఎండుగడ్డి అయితే కొంత ఖర్చు తగ్గుతోంది. ప్రస్తుతం కొన్నిచోట్ల ఎండుగడ్డి విక్రయాలు సాగుతున్నాయి. అయితే చిన్న మోపు రూ.వందకు విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు గడ్డి కొనుగోలు చేయాలంటే రూ.25 వేల వరకూ ఖర్చయ్యే పరిస్థితి నెలకొంది. ఇంత పెద్దమొత్తంలో వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే పరిస్థితిలో రైతులు లేరు. దీంతో రెండు పశువులు ఉంటే ఒక పశువును విక్రయించే ఆలోచనలో రైతులు ఉన్నట్లు చెబుతున్నారు. అదే జరిగితే రైతుల జీవనంపై తీవ్ర ప్రభావం పడుతుంది. పాలతో వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో చాలా కుటుంబాలను ఆర్థిక కష్టాలు వెంటాడనున్నాయి. ప్రభుత్వం టిఎంఆర్ (టోటల్ మిక్సిడ్ దాణా) పేరుతో సబ్సిడీ ధరలకు రైతులకు అందిస్తోంది. ప్రస్తుతం 30 టన్నుల వరకూ ఇస్తున్నట్లు సమాచారం. దీన్ని మరింత ఎక్కువగా రైతులకు సరఫరా చేస్తే మేలు జరుగుతోంది. లేకపోతే పశులను రైతులు అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. అదే సమయంలో పాలకొరత పెరిగి ప్రజలు ఇబ్బంది పడే పరిస్థితి రానుంది. ప్రభుత్వం ముందుగానే ఎండుగడ్డి విషయంలో ప్రత్యామ్నాయాలను ఆలోచించి రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.

కూలీలతో మాట్లాడుతున్న పి.రామకృష్ణ

ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికే

బడ్జెట్ కేటాయింపుల్లో కోత

ప్రజాశక్తి - చాట్రాయి

ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చేందుకు కేంద్ర ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో ఉపాధి పనులకు నిధులు భారీగా తగ్గించిందని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. శనివారం మండలంలోని చిన్నంపేటలో ఉపాధి పని ప్రదేశంలో వర్కర్ల కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పి.రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఏడాది కేటాయింపులు రూ.60 వేల కోట్లు మాత్రమేనన్నారు. 2023లో సవరించిన అంచనా రూ.89,400 కోట్లు, ప్రస్తుత బడ్జెట్ అంచనా రూ.73 వేల కోట్లు అని తెలిపారు. సాధారణంగా ఈ చట్టానికి బడ్జెట్‌లో 20 శాతం కంటే ఎక్కువ గతంలోని బకాయిలు చెల్లించడానికి ఖర్చువుతుందన్నారు. వంద రోజులు పని కల్పించాలంటే రూ.2.72 లక్షల కోట్లు అవసరమని అంచనా వేసిన కేంద్ర ప్రభుత్వం ఆ మేరకు నిధులు పెంచకపోవడం దుర్మార్గమన్నారు. ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద వేతన జాబితాలను ఎస్‌సి, ఎస్‌టి ఇతరుల అనే కేటగిరీగా విభజించాలని మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరిందన్నారు. ఈ పద్ధతులు కొత్త చిక్కులను సృష్టించాయని విమర్శించారు. ముఖ్యంగా వేతనాల చెల్లింపులో మరింత జాప్యం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చెల్లించే వేతనాల వాటాను కూడా 60:40 (కేంద్రం:రాష్ట్రం) నిష్పత్తిలో పంచుకోవాలని ఇటీవల గ్రామీణాభివృద్ధి మంత్రి సూచించారని, ఇది చాలా ప్రమాదకరమైన ప్రతిపాదన అని మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసే కుట్రలో భాగంగా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని తెలిపారు. బడా కార్పొరేట్ సంస్థలకు ఏటా లక్షల కోట్ల రూపాయల పన్నురాయితీలు, మినహాయింపులు చేసేందుకు వెనుకాడని మోడీ ఉపాధి హామీ చట్టానికి తగినన్ని నిధులు కేటాయించడానికి సుముఖంగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా ధనికులు, కార్పొరేట్ ప్రయోజనాల కోసం పనిచేస్తుందని విమర్శించారు. బిజెపి విధానాలను ప్రజాక్షేత్రంలో ఖండించాలని కోరారు. ఉపాధి హామీలో పనిదినాల సంఖ్యను 200 రోజులకు పెంచాలని, పనికోసం వారందరికీ పని కల్పించాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు కె.ఆనంద్, గంగరాజు, మోహన్ పాల్గొన్నారు.


మృతుని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న నాయకులు

వెంకటేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని రేచర్లలో ఉపాధి హామీ పనులు చేస్తూ మృతిచెందిన ఎరువా వెంకటేశ్వరావు కుటుంబానికి రూ.25 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకష్ణ డిమాండ్ చేశారు. వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ బృందం శనివారం పరామర్శించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ వెంకటేశ్వరరావు మృతిచెంది ఐదు రోజులైనా ప్రభుత్వం, మండల డ్వామా అధికారులు కనీసం పరామర్శించలేదన్నారు. కుటుంబానికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి పని ప్రదేశాల్లో వేసవిలో తాగునీరు, మజ్జిగ, టెంట్లు, మెడికల్ కిట్లు లేకపోవడం వల్లనే ఉపాధి కూలీలు పిట్టల్లా రాలుతున్నారని మండిపడ్డారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తుందని ఎద్దేవా చేశారు. ఉపాధి కూలీలు చనిపోతే కనీసం జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పది వేల రూపాయలు చేతిలో పెట్టి మండల, గ్రామ అధికారులు చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. వెంకటేశ్వర కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, చదువుకున్న పిల్లల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరరావు మృతికి సంఘం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్‌విఎస్.నారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు డి.సత్యనారాయణ, కె.వాసు పాల్గొన్నారు.

సురేష్ ముదిరాజ్ పై దాడి అమానుషం

ప్రజాశక్తి - కలిదిండి

నెల్లూరు జిల్లా కావలిలో మొగిరాల సురేష్ ముదిరాజ్‌పై పోలీసుల దాడి అమానుషమని ముదిరాజ్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు వెంకటరాజు అన్నారు. కలిదిండిలో ఆయన శనివారం మాట్లాడుతూ కావలిలో సిఎం జగన్‌కు ప్రజాసమస్యలపై వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించిన సురేష్‌పై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. బిసిలను అణచివేసే ధోరణిలో ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ముఖ్యంగా ముదిరాజ్ కులస్తులంటే చులకన భావంతో చూస్తోందన్నారు. ఇలాంటి అరాచక చర్యలను ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలన్నారు. ప్రజాసమస్యలను స్వీకరించే వెసులుబాటు ప్రభుత్వానికి లేకపోవడం దురదృష్టకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో తగు సమాధానం ఉంటుందని వెంకటరాజు హెచ్చరించారు.

బిజెపికి కర్నాటకలో గుణపాఠం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

చేనేతల ఆకాంక్షను అవహేళన చేసిన బిజెపికి కర్ణాటకలో చేనేతలు తగిన బుద్ధి చెప్పారని పద్మశాలి సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షులు వానపల్లి నాగరాజు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చేనేతపై జిఎస్‌టి తొలగించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, గ్రూప్ ఆఫ్ ఫైనాన్స్ మినిస్టర్స్ ఛైర్మన్ బస్వరాజ్ బొమ్మైకి పలుమార్లు విజ్ఞప్తి చేసినా పెడచెవిన పెట్టారన్నారు. అపాయింట్‌మెంట్ అడిగితే అవహేళన చేసిన బస్వరాజ్‌కు తగిన గుణపాఠం చెప్పడానికి ఏడాదికాలంగా అఖిల భారత పద్మశాలి సంఘం కర్ణాటకలో పనిచేసిందన్నారు. అఖిల భారత పద్మశాలి సంఘం వ్యూహాత్మకంగా అనేక ఎత్తుడగలను కర్ణాటకలో అమలుపరిచిందని తెలిపారు. ఈ ఏడాది జనవరి ఐదో తేదీన జీరో జిఎస్‌టి ఉద్యమానికి చేనేత కులాలు, సామాజిక ఉద్యమకారుల మద్దతు కూడగట్టడంలో సఫలీకృతమైందన్నారు. తమ ఓటు ద్వారా బిజెపికి గుణపాఠం చెప్పారన్నారు. చేనేతపై జిఎస్‌టి తొలగించే వరకూ పద్మశాలి సంఘం పోరాడుతుందని తెలిపారు.

వైఎస్ఆర్ బీమాను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వైఎస్ఆర్ బీమా పథకాన్ని అర్హులైన ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వైసిపి మండల అధ్యక్షులు పల్లగాని నరసింహారావు అన్నారు. శనివారం సింగన్నగూడెంలో అనారోగ్యంతో మృతిచెందిన కె.వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు వైఎస్ఆర్ బీమాలో మట్టి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.పదివేలు నగదును గ్రామ సర్పంచి పల్లగాని రమాదేవిజమదగ్నితో కలిసి ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిన్ని రాంబాబు, కానూళ్ల రాంబాబు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కిరణ్ పాల్గొన్నారు.


బీమా సాయం అందిస్తున్న సర్పంచి, వైసిపి నాయకులు

27న ఎపిజెఎసి అమరావతి ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈనెల 27న ఏలూరులో నిర్వహించే ఎపిజెఎసి అమరావతి ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని జెఎసి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణ జిల్లాల ప్రాంతీయ సదస్సును ఏలూరులోని టుబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో నిర్వహించనున్న నేపథ్యంలో శనివారం స్థానిక రెవెన్యూ భవన్‌లో కె.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కె.రమేష్‌కుమార్ మాట్లాడుతూ 63 రోజులుగా తమ సంఘం చేస్తున్న పోరాటాల ఫలితంగా ఎపిజిఎల్‌ఎ, జిపిఎఫ్, సిపిఎస్ పది శాతం వాటా రూ.5,800 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన జిల్లాలకు 16 శాతం హెచ్‌ఆర్‌ఎ, డిఎ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేశారని తెలిపారు. ఉద్యోగుల డిమాండ్లు పరిష్కారమయ్యేవరకూ ఎపిజెఎసి అమరావతి పోరాటం చేస్తుందన్నారు. ఈ పోరాటంలో ప్రతీఉద్యోగి స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఒకటో తేదీన వేతనాలు, పెన్షన్లు ఖాతాల్లో వేయాలని, అదే విధంగా పాత డిఎ ఎరియర్స్, 11వ పిఆర్‌సి బకాయిలు అన్నీ కలిపి ఒక్కో ఉద్యోగికి రూ.లక్ష నుండి రూ.నాలుగు లక్షల వరకు ఈ ప్రభుత్వం నుండి రావాల్సి ఉందని తెలిపారు. వాటిని తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేస్తామని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంచుతామని ఎన్నికల సమయంలో సిఎం జగన్ హామీలిచ్చారని, వాటిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి జెఎసి అమరావతి జనరల్ సెక్రెటరీ బి.రాంబాబు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సిఐటియు నాయకులు, ఆర్‌టిసిఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు టిపిఆర్.దొర, ఎపి జెఎసి అమరావతి కృష్ణా జిల్లా ఛైర్మన్ కిషోర్, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రాజు, ఎ.ప్రమోద్, నాయకులు వర్మ, వీరబాబు, వేణు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మహాలక్ష్మి, సచివాలయ ఉద్యోగుల నాయకులు జ్యోతి, హుస్సేన్ వివిధ ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

బిసిలకు జగన్ అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

బిసిలకు కేటాయించిన రూ.75 వేల కోట్లను సిఎం జగన్ దారిమళ్లించి తీవ్ర అన్యాయం చేశారని ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి బిసి సెల్ అధ్యక్షులు రెడ్డీ శ్రీనివాస్ చక్రవర్తి విమర్శించారు. శనివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలు రాణించాలని చంద్రబాబు కల్పించిన 34 శాతం రిజర్వేషన్లను ఈ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించిందని, 16,800 పదవులు బిసిలకు దూరయ్యాయన్నారు. చంద్రబాబు పాలన కాలంలో వివిధ కార్పొరేషన్లు స్వయం ఉపాధి రుణాలను అందించి బిసిల అభ్యున్నతికి పాటుపడేవని, కానీ నేడు ఒక కార్పొరేషన్ ఛైర్మన్‌కు కూడా కూర్చోవడానికి కుర్చీ కూడా లేదని, ఈ నాలుగేళ్ల కాలంలో ఒక యూనిట్‌కు కూడా రుణం ఇవ్వలేదని విమర్శించారు. సిఎం జగన్ ప్రభుత్వంలో 650 మంది బిసి నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని, 2500 మందికి పైగా బిసిలపై దాడులు, దౌర్జన్యాలు చేశారని, ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని, ఎదిరిస్తే దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసిల సత్తాచాటేందుకు ఈనెల 18వ తేదీ నుంచి 22 వరకూ జగన్ అరాచకాలపై బిసిలను ఏకం చేస్తూ పోరుబాటకు పిలుపునిస్తున్నామని, జగన్‌ను గద్దెదించి చంద్రబాబుని సిఎం చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో బిసి సెల్ జిల్లా ప్రధానకార్యదర్శి ఇప్పిలి వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి జంపా సూర్యనారాయణ, బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6475 కేసులు రాజీ

ప్రజాశక్తి - ఏలూరు


కైకలూరులో లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 6475 కేసులు రాజీ చేశామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్ తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమకుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ఈ అదాలత్‌ను నిర్వహించారమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో అవగాహన సదస్సును రామగోపాల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగు కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఈ కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు వివిధ రకాల పద్ధతుల్లో లోక్ అదాలత్ ద్వారా కేసులను రాజీ చేస్తున్నామని, దీనిద్వారా డబ్బు, సమయం ఆదా అవుతుందని తెలిపారు. ఇరుపక్షాలకు సమన్యాయం జరుగుతుందని, కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా 31 బెంచీలను ఏర్పాటు చేశామని, ఈ బెంచీల్లో 6475 కేసులు రాజీ చేశామన్నారు. వీటిలో 106 వాహన ప్రమాద కేసులు రాజీ చేయడం ద్వారా రూ.4,93,20,105, 115 సివిల్ కేసులను, 6038 క్రిమినల్ కేసులను పరిష్కరించామని తెలిపారు. అలాగే మున్సిపల్ టాక్స్ కేసులను, బ్యాంకు కేసులను, టెలిఫోన్ బిల్లుల కేసులను, ప్రీ లిటిగేషన్ కేసులు రాజీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో శాశ్విత న్యాయ పీఠం ఛైర్మన్ ఎ.మేరీగ్రేస్ కుమారి, డిఎస్‌పి పైడేశ్వరరావు, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అభినేని విజయకుమార్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు కక్షిదారులు పాల్గొన్నారు.

కైకలూరు: కేసుల పరిష్కారంలో రాజీమార్గం ఉత్తమమైనదని సీనియర్ సివిల్ జడ్జి కె.షణ్ముఖరావు, జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు అన్నారు. స్థానిక కోర్టు వద్ద శనివారం మెగా లోక్‌అదాలత్ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాడెం వీర వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ అదాలత్‌లో పలుకేసులు రాజీ చేశారు. రాజీ వల్ల కక్షిదారుల విలువైన సమయం, ధనం వృధా కావని న్యాయమూర్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్-ఎస్.రాజు, జాయింట్ సెక్రటరీ చావలి శంకర శాస్త్రి, లైబ్రరీ సెక్రటరీ కె.రమాదేవి, ఎపిపివి.శ్రీరామచంద్రమూర్తి, సీనియర్ న్యాయవాదులు గురజాడ ఉదయ్ శంకర్, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భీమడోలు: భీమడోలు న్యాయస్థానం వేదికగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం న్యాయస్థానం ఇన్‌ఛార్జి న్యాయమూర్తి సగబాల వాసుదేవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 270 కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కారమయ్యాయని న్యాయస్థానం అధికారులు తెలిపారు. దీనిలో భాగంగా నేర అంగీకారం కేసులు 27, భూ తగాదాలు 22, తొమ్మిది ప్రయివేట్ కేసులు, ఒక మనోవర్తి కేసు, 211 పెట్టీ కేసులు పరిష్కారం అయ్యాయని తెలిపారు. జరిమానాలు, ఇతర రూపాల్లో రూ.1,39,350 వచ్చాయని న్యాయస్థానం అధికారులు తెలిపారు.

చింతలపూడి : చింతలపూడి కోర్టులో శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 154 కేసులు రాజీ అయినట్లు చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి సి.మధుబాబు తెలిపారు. క్రిమినల్ కేసులు 30, ప్రోనోటు కేసు ఒకటి, చెక్‌బౌన్సు కేసులు తదితర కేసులు రాజీ అయ్యాయని తెలిపారు. 114 న్యూసెన్స్ కేసులు రాజీ చేసి కక్షిదారుల నుండి రూ.3,63,960 అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని, లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. చిన్నచిన్న తగాదా కేసులు రాజీపడి గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలన్నారు. ఏలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్, సభ్యులు డేవిడ్‌రాజు, న్యాయవాదులు నరుకుళ్ల సత్యనారాయణ, న్యాయవాదులు, సోషల్ వర్కర్ అక్బర్ అలీ, సిఐ మల్లేశ్వరరావు, పోలీస్ సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఏలూరులో కేసుల రాజీ పత్రాలు అందిస్తున్న రామ్‌గోపాల్


ఏలూరులో..

కాంగ్రెస్ విజయంతో సంబరాల్లో నేతలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయఢంకా మోగించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో స్థానిక వసంతమహల్ సెంటర్ వద్ద కాంగ్రెస్ నేతలు సంబరాలు చేసుకున్నారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఈ వేడుకలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అభిమానులకు స్వీట్లు పంచారు. అనంతరం రాజనాల మోహన్‌రావు మాట్లాడుతూ కర్ణాటక విజయం రాబోయే కేంద్ర ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారానికి సంకేతమన్నారు. త్వరలో మంచి రోజులు రాబోతున్నాయని, అందరం కలిసికట్టుగా పనిచేసి కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరిచి విజయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతాప సుబ్రహ్మణ్య శర్మ, గౌడ రంగబాబు, బురదగుంట క్రాంతి, తాళ్లూరి చక్రవర్తి, సేవాదళ్ సీనియర్ నాయకులు సుబ్బారావు, నల్లగట్ల అనిల్, కొమ్మన సాంబశివరావు, ఉప్పు మురళీకృష్ణ, వేల్పుల వెంకటేశ్వరరావు, మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కర్ణాటకలో కాంగ్రెస్ విజయం సాధించడంపై ఎపి రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్ విజయంపై సంబరాలు జరుపుకున్నారు. ఆనంతరం రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దాల ప్రసాద్, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు మాట్లడుతూ కర్ణాటక విజయం ప్రజావిజయమన్నారు. అక్కడ ప్రజలు బిజెపిని తిరస్కరించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు. మోటార్ బైకులతో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నులకాని నాగబాబు, జిల్లా కార్యదర్శి వనచర్ల లింగస్వామి, తాడేపల్లి ఉమాదేవి, గోలి శ్రీనివాసరెడ్డి, మామిడి రాము, ఎర్ర సత్యనారాయణ పాల్గొన్నారు.


జంగారెడ్డిగూడెంలో..

నూరుశాతం హామీల అమలు ఘనత జగన్‌దే

ఎంఎల్ఎ ఎలిజా

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఎన్నికల హామీలను నూటికి నూరుశాతం అమలు చేసిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని చింతలపూడి ఎంఎల్‌ఎ ఉన్నమట్ల ఎలిజా అన్నారు. మండలంలోని మైసన్నగూడెంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ ప్రతీఇంటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్య మంత్రి జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ తూచా తప్పకుండా అమలు చేశారన్నారు. అమ్మఒడి, రైతు భరోసా, ఆసరా, విద్యా దీవెన వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సర్పంచి సింగిదాస్ హైమావతి, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, ఎంపిపి కొదమ జ్యోతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ ఎలిజా

చక్కని రాత భవితకు బాట

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు బాలల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు శనివారం హ్యాండ్‌రైటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. అనంతరం కథలు చదువడం, డ్రాయింగ్, మెడిటేషన్, తెలుగు పద్యాలుపై తరగతులు నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి వెస్ట్రన్ డ్యాన్స్ క్లాస్ నిర్వహించనున్నట్లు గ్రంథాలయ నిర్వాహకురాలు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.


గణేశ్వరరావు మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు

మాజీ సర్పంచి గణేశ్వరరావు మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు


గణేశ్వరరావు (ఫైల్)

నారాయణపురం పంచాయతీ మాజీ సర్పంచి, కాంగ్రెస్ నాయకుడు పెద్దిరెడ్డి గణేశ్వరరావు (73) శనివారం తెల్లవారుజామున ఛాతి నొప్పితో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు సందర్శించి నివాళులర్పించారు. గణేశ్వరరావు కాంగ్రెస్ హయాంలో, అప్పటి శాసనసభ్యుడు, మంత్రి వట్టి వసంతకుమార్ సహకారంతో నారాయణపురంలో 16 ఎకరాల్లో 678 మందికి ఇళ్ల స్థలాలను 2008లో ఇప్పించారు. ఆయన హయాంలో వైఎస్ఆర్ కాలనీ ఏర్పాటు అత్యంత వేగంగా అభివృద్ధి చెందిన కాలనీగా జిల్లాలో ప్రసిద్ధి. గ్రామం కోసం ఎల్లప్పుడూ ఆలోచించే గణేశ్వరరావు మృతి తీరని లోటని ఎంఎల్ఎ వాసుబాబు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. మండల ఐస్ పరిశ్రమల యూనియన్ అధ్యక్షునిగా కొంతకాలం పని చేశారు. ఐస్ పరిశ్రమ నిర్వాహకులు, ఆక్వా రైతులు, గ్రామస్తులు, రాజకీయ నాయకులు, వైఎస్ఆర్ కాలనీ ప్రజలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ప్రమాదంలో నుజ్జయిన ఆటో

ఆటోను ఢీకొట్టిన కారు
11 మందికి గాయాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు-గుండుగొలను మధ్య 216 నెంబర్ జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో 11 మంది తీవ్ర గాయాల పాలయ్యారు. కైకరం నుంచి హనుమాన్ జంక్షన్‌కు 11 మంది ప్రయాణికులు ఆటోలో బయలుదేరారు. ఈ క్రమంలో భీమడోలు దాటిన తర్వాత వారు ప్రయాణిస్తున్న ఆటోను ఏలూరు వైపు వెళుతున్న కారు వెనుక నుంచి ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడి అందులో ఉన్న 11 మంది తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుల్లో ఏడుగురిని నేషనల్ హైవే అంబులెన్స్‌లో ,మిగిలిన వారిని 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మృతిచెందిన అక్బర్‌బాష

మండలంలోని తాటియాకులగూడెం సమీపంలో జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి గ్రామానికి చెందిన పఠాన్ అక్బర్ బాషా తెలంగాణలోని రైస్‌మిల్లులో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎప్పటిలానే శనివారం ఉదయం బైక్‌పై రైస్‌మిల్లు వద్దకు బయలుదేరాడు. ఈ క్రమంలో తాటియాకులగూడెం వద్దకు వెళ్లేసరికి ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని స్థానికులు జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పఠాన్ మృతితో కుటుంబసభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

విద్యుదాఘాతంతో బాలికకు గాయాలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుదాఘాతానికి గురైన బాలక గాయాలపాలైన సంఘటన మండలంలోని వెలగపాడులో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వరదల మురళి కుమార్తె శనివారం డాబాపై ఆడుకుంటుంది, ఈ క్రమంలో ఆట వస్తువు పడి ఉన్న చోట విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురవ్వడంతో బాలిక కాళ్లు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాలికను జంగారెడ్డిగూడెం ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ తీగల కింద ఇల్లు నిర్మిస్తే ప్రమాదకరమని చెప్పారు.

వ్యక్తిపై ఫోక్సో కేసు

ప్రజాశక్తి - మండవల్లి

బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చావులపాడు గ్రామానికి చెందిన బాలిక కైకలూరులో ఇంటర్ చదువుతుంది. అదే గ్రామానికి చెందిన గంగుల ఫణీంద్ర బాలికను కాలేజీకి వెళ్లివచ్చే సమయంలో మానసికంగా వేధిస్తున్నాడు. అంతేకాకుండా ఈనెల ఆరో తేదీన ఆమెను ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి కోరికతీర్చాలంటూ ఆమెను ఇబ్బందులకు గురి చేశాడు. ఈ విషయాన్ని ఆ బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో వారు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్ఐ ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ, పోక్సో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - మండవల్లి

మండలంలోని పెరికేగూడెం గ్రామానికి చెందిన బాలిక అదృశ్యమైంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటర్ చదువుతున్న బాలిక ఈనెల 12వ తేదీరాత్రి తొమ్మిది గంటల సమయంలో బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల బంధువుల వద్ద బాలిక ఆచూకీ కోసం వెతికినప్పటికీ దొరకలేదు. దీంతో పి.కన్నాపురానికి చెందిన గుడిసె దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కుమార్తెను తీసుకెళ్లి ఉండొచ్చని బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రతినెలా రెండో శనివారం ఉచిత వైద్య సేవలు

శ్రీకృష్ణ హాస్పిటల్

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక ఆర్ఆర్ పేటలోని శ్రీ కృష్ణ హాస్పిటల్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఎముకలు, కీళ్లు, నరములు, వెన్నెముక, శస్త్రచికిత్స వైద్యంలో పదేళ్ల అనుభవం ఉన్న లయన్ డాక్టర్ బి.కృష్ణ బృందంతో ప్రతి నెల రెండో శనివారం ఉచితంగా రక్త పరీక్షలు, ఎక్స్‌రే, ఎముకల బలము, (సాంద్రత) పలు పరీక్షలు చేస్తారు. ఈ క్రమంలో శనివారం 97 మందిని పరీక్షించి అందరికీ ఉచితంగా రక్త పరీక్షలు, బోన్ స్కానింగ్, ఎక్స్‌రేలు చేశారు. డాక్టర్ అఖిల్, మార్కెటింగ్ మేనేజర్ నాగేశ్వరరావు, ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ టి.అబ్రహాంలింకన్, ఉపాధ్యక్షులు లయన్ ఎడివిఎ ఎస్‌వి.సుబ్రహ్మణ్యం, జిల్లా నాయకులు లయన్ ఎంజెఎఫ్ పి.మురళీకృష్ణ, లయన్ ఎంజెఎఫ్ విజిఎంవిఆర్ కృష్ణారావు, వైద్య బృందం పాల్గొన్నారు. డాక్టర్ కృష్ణ మాట్లాడుతూ ప్రతి నెల రెండో శనివారం ప్రజలకు ఉచితంగా సేవలందించాలనే లక్ష్యంతో ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్‌లో మెంబర్‌గా చేరానని చెప్పారు. గత మూడు నెలల నుంచి ప్రతి నెల రెండో శనివారం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. ఏలూరు, ఏలూరు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సేవలు వినియోగించుకోవాలన్నారు. క్లబ్ అధ్యక్షులు అబ్రహాంలింకన్, ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, మురళీకృష్ణ, కృష్ణారావు మాట్లడుతూ వైద్యం ఖర్చుతో కూడుకుందని, ప్రజలకు సేవ చేయాలనే మంచి ఉద్దేశంతో డాక్టర్ కృష్ణ, వారి బృందం పేద ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నందుకు క్లబ్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. వైద్య సేవల కోసం వచ్చిన వారందనికీ మజ్జిగ ప్యాకెట్లు అందించారు.

వైద్య శిబిరంలో ప్రజలు

15 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఎంప్లాయిస్ కాలనీలోని శ్రీ మడుపల్లి తాతయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఆఫీజ్ షేక్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ జూన్ 14వ తేదీ వరకు అడ్మిషన్లు కొనసాగుతాయన్నారు. బాలురకు, బాలికలకు విడ విడిగా ఉచిత హాస్టల్ సదుపాయం కూడా కలదని చెప్పారు.

జిఒ 1 రద్దుపై హర్షం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం అప్రజాస్వామికంగా జారీ చేసిన జిఒ నెంబర్ 1ని రద్దు చేస్తూ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల పట్ల టిడిపి నూజివీడు ఇన్‌ఛార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ తీర్పు ప్రభుత్వానికి చెంప పెట్టని తెలిపారు.

నేడు ముసునూరులో భారీ అన్నసమారాధన

ప్రజాశక్తి - ముసునూరు

మండల కేంద్రమైన ముసునూరు సినిమా హాలు సెంటర్ వద్ద అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నటుల తెలిపారు. ఈ మహోత్సవానికి రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి సగర సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, పలు రాజకీయ పార్టీల నాయకులు విచ్చేస్తారని తెలిపారు.

యుద్ధప్రాతిపదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు

ప్రజాశక్తి - భీమడోలు

గాలి వాన వల్ల భీమడోలు మండల పరిధిలో

పూళ్లలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు

విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడిన నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు శనివారం సాయంకాలం 95 శాతం పూర్తయినట్లు ట్రాన్స్ కో భీమడోలు ఎడిఇ గోపాలకృష్ణ తెలిపారు. పునరుద్ధరణ పనుల్లో తొలి ప్రాధాన్యత తాగునీటి సరఫరాకు ఇచ్చామని, ఆ తర్వాత గృహ అవసరాలకు ఇచ్చామని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయన్నారు. గాలి వాన వల్ల తమ శాఖకు రూ.50 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. దీనిలో భాగంగా 110 స్తంభాలు, పది వరకు 33 కెవి విద్యుత్ సరఫరా చేసే ప్రత్యేక స్తంభాలు పాడయ్యాయన్నారు. పది ట్రాన్స్ ఫార్మర్లను నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. ఆదివారంతో గాలివానల వల్ల నష్టపోయిన గ్రామాల్లో పూర్తిస్థాయి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు పూర్తవుతాయని ఎడిఇ తెలిపారు.

కమిషనర్‌కు పారిశుధ్య కార్మికుల సన్మానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘ కమిషనర్ అబ్దుల్ రషీద్‌ను పారిశుధ్య కార్మికుల సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. పారిశుధ్య సంఘం నేతలు ముత్యాల నాగేంద్రరావు, నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించినందుకు కృతజ్ఞతగా సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, మున్సిపల్ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను సత్కరిస్తున్న కార్మికులు

సెన్నంశెట్టి కుటుంబసభ్యుల సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - మండవల్లి

కూలింగ్ వాటర్ శిబిరాన్ని ప్రారంభిస్తున్న భాస్కరరావు, దుర్గారావు

వేసవిలో పాదాచారులు, వాహనదారుల దాహార్తిని తీర్చేవిధంగా ఉచిత కూలింగ్ వాటర్ శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు పేర్కొన్నారు. కీర్తిశేషులు సెన్నంశెట్టి సీతారామయ్య వారి కుమారుడు కీర్తిశేషులు శ్రీనివాసరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు మండవల్లి ప్రధాన సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఉచిత కూలింగ్ వాటర్ కేంద్రాన్ని శనివారం భాస్కరరావు, దుర్గారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిదండ్రులు ఇచ్చిన ఆస్తులను పంచుకొని తదనంతరం తల్లిదండ్రులను విస్మరించే ఈ రోజుల్లో మృతి చెందిన వారి పేరు మీదుగా సేవా కార్యక్రమాలను నిర్వహించడం మరింత అభినందనీయమన్నారు. వృత్తిరీత్యా విజయవాడలో స్థిరపడినప్పటికీ సొంత ఊరు అనే భావనతో మండవల్లిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. అంతేకాకుండా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల స్థాయిలో నిర్వహించిన దేశభక్తి పాటలు, ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కీర్తిశేషులు మిఠాయి కొట్టు సీతారామయ్య, శ్రీనివాసరావు పేరుమీద అందించారని వారు గుర్తు చేశారు. కుటుంబీకులను గుర్తు చేసుకుంటూ మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టి.అప్పారావు పాల్గొన్నారు.

సూరేపల్లిలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ముసునూరు

వేసవిలో యువకులకు క్రికెట్ మంచి వినోదాన్ని ఇస్తుందని రైతు సంఘం మాజీ నాయకులు అక్కినేని చందు, టిడిపి సూరేపల్లి గ్రామ అధ్యక్షులు మల్లిబాబు తెలిపారు. మండలంలోని సూరేపల్లి గ్రామంలో పొన్నగంటి చందు యూత్ ఆధ్వర్యంలో ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు జరుగుతున్నాయి. పర్వతనేని గంగాధరరావు ప్రైజ్ మనీ నిమిత్తం రూ.60 వేలు అందించారు. ఈ సందర్భంగా గంగాధరరావును పలువురు అభినందించారు. శోభనపురం గ్రామ సర్పంచి నక్కనబోయిన వేణు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు


దంపతులను ఆశీర్వదిస్తున్న జయమంగళ

వధూవరులకు ఎంఎల్‌సి జయమంగళ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

వధూవరులను శాసనమండలి సభ్యులు జయమంగళ వెంకటరమణ ఆశీర్వదించారు. మండలంలోని లింగాల గ్రామంలో శనివారం నిర్వహించిన మద్దినేని శ్రీనివాసరావు కుమారుడు వివాహ రిసెప్షన్‌లో జయమంగళ పాల్గొని వధూవరును అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఒకరినొకరు అర్థం చేసుకుంటూ జీవనం సాగిస్తూ పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో ఉంటూ పలువురికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఆయనతో పాటు దేవస్థానం ఛైర్మన్ రాజులపాటి యశోధనరావు, లింగాల పిఎసిఎస్ అధ్యక్షులు రామ్మోహన్‌రావు, చినకామనపూడి సర్పంచి నాంచారయ్య ఉన్నారు.

చనిపోయిన చేపలు

చేపల దుర్వాసనతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని ఎర్రమిల్లిపాడు, నల్లమాడు గ్రామాల మధ్యలో ఉన్న నల్లమాడు చెరువులో రాతిగొరచ చేపలు చచ్చిపోయి నీటిపై తేలుతూ దుర్వాసన వస్తున్నాయి. ఈ చెరువు నీటిని పశువులు తాగి రోగాలబారిన పడుతున్నయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. చెరువులో చేపలు పెంపకానికి వేలం పాటలో పాడుకున్న పాటదారుడు చెరువుఅడుగున రాతి గొరచను తొలగించేందుకు మందును కలిపారని దీంతో చిన్నచేపలు చనిపోయి కుళ్లిపోతున్నాయని తెలిపారు. కుళ్లిన చేపలను దూరంగా తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతు పోరుబాట విజయవంతం
ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - తణుకు

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు చేపట్టిన రైతు పోరుబాట పాదయాత్ర విజయవంతం చేసిన అందరికీ మాజీ ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అభినందనలు తెలిపారు. శనివారం ఆయన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాదయాత్రలో రైతులు పెద్ద ఎత్తున పాల్గొని వారి సమస్యలను వివరించారన్నారు. రైతుల నుంచి ధాన్యం సేకరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సంచులు లేక ఇచ్చిన సంచులు చిరిగిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందన్నారు. చంద్రబాబును తిట్టే స్థాయి స్థానిక మంత్రికి లేదన్నారు. చంద్రబాబు దిష్టిబొమ్మను దగ్ధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చానని, రైతులపై పూర్తి అవగాహన ఉందని, తన తాత 40 ఏళ్ల క్రితమే రైస్ మిల్లు స్థాపించారని తెలిపారు. మూడేళ్ల కాలంలో రైతులకు ఏనాడైనా సక్రమంగా డబ్బులు చెల్లించారా అని ప్రశ్నించారు.

నాడు తండ్రి... నేడు తనయుడు

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నేడు పాతపాటి శ్రీనివాసరాజు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - కాళ్ల

పార్టీ పట్ల విధేయతతో పని చేయడం, రాజకీయాల్లో రాణించడం కత్తి మీద సాములాంటిదే. అయినా వెరవకుండా బాధ్యతాయుతంగా తండ్రి పాతపాటి సర్రాజు అడుగుజాడల్లో పయనిస్తూ అందొచ్చిన అవకాశాలను వినియోగించుకుంటూ ఎదిగారు పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు). కాంగ్రెస్ పార్టీలో చేరి రాజకీయాల్లోకి అడుగుపెట్టిన శ్రీనివాసరాజు ఆ తర్వాత వైసిపి ఆవిర్భావం నుంచి తన తండ్రి సర్రాజు వెన్నంటే ఉంటూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలోనూ అడుగు కలిపారు. 2021లో వైసిపి ప్రభుత్వం ఉండి మాజీ ఎంఎల్ఎ పాతపాటి సర్రాజుకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని కట్టబెట్టింది. పాతపాటి శ్రీనివాసరాజు తండ్రి పాతపాటి సర్రాజు 2004లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి ఎంఎల్ఎగా గెలుపొందారు. 2009లో కాంగ్రెస్ తరపున, 2014లో వైసిపి నుంచి ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాక 2021లో సర్రాజుకు నామినేటెడ్ పదవి దక్కింది. ఆయన ఆ పదవిలో ఉండగానే ఈ ఏడాది ఫిబ్రవరిలో గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన సంగతి తెలిసిందే.

ఆ సందర్భంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి పాతపాటి సర్రాజు తనయులకు సముచిత ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు పాతపాటి సర్రాజు పెద్ద కుమారుడు పాతపాటి శ్రీనివాసరాజుకు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని జగన్ కట్టబెట్టారు. కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన పాతపాటి వెంకట శ్రీనివాసరాజు వైసిపిలో క్రియాశీలంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 14న విజయవాడలో క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా శ్రీనివాసరాజు ప్రమాణస్వీకారం చేయనున్నారు. వెంకటేశ్వరరావు రెసిడెన్సీలో అదే రోజు క్షత్రియ కార్పొరేషన్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించనున్నారు.

ఉండిలో వైసిపి జెండా ఎగురవేస్తాం

సిఎం జగన్‌కు రుణపడి ఉంటా - రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు)

ప్రజాశక్తి - కాళ్ల

ఉండి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేసి రానున్న ఎన్నికల్లో వైసిపి జెండా ఎగురవేస్తామని రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ తమ కుటుంబంపై ఆదరాభిమానాలు చూపుతూ తమ వెన్నంటే ఉంటున్న కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. తన తండ్రి పాతపాటి సర్రాజు చేపట్టిన క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని తనకు కట్టబెట్టడం ద్వారా సిఎం జగన్మోహన్‌రెడ్డి తమ కుటుంబానికి ఎనలేని గుర్తింపునిచ్చి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. నాడు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాం నుంచి తమ కుటుంబానికి పలు సందర్భాల్లో ప్రాధాన్యతినిస్తూనే ఉన్నారన్నారు. రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం కూడా జగన్మోహన్‌రెడ్డి తమ కుటుంబం వెన్నంటే ఉన్నారని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన అనంతరం తన తండ్రి సర్రాజును గుర్తించి రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి కట్టబెట్టి రాష్ట్రంలోని క్షత్రియులందరికీ సేవ చేసే భాగ్యాన్ని కల్పించారన్నారు. అయితే ఆయన మరణానంతరం ఆ పదవిని మా కుటుంబానికే ఇవ్వాలనే ఆలోచనతో తనకు అవకాశం కల్పించారని కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి పాతపాటి సర్రాజు నిర్వహించిన పదవిలో తనను నియమించడం సంతోషంగా ఉందన్నారు. వైసిపి బలోపేతానికి కృషి చేస్తానన్నారు. నామినేటెడ్ పదవులన్నీ అన్ని సామాజిక తరగతులకు కేటాయించడంతోపాటు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అగ్రవర్ణాల్లోని పేదలకు తమ ప్రభుత్వం అండగా ఉండి వారి సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. క్షత్రియుల్లో కూడా పేదలున్నారని, వారికి అండగా ఉండి ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తలచి క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ, ఏ ముఖ్యమంత్రి కూడా క్షత్రియ కార్పొరేషన్‌పై ఆలోచన చేయలేదన్నారు. అన్ని తరగతులకు సముచిత స్థానం కల్పించి ముఖ్యంగా అగ్రవర్ణాల్లోని పేదలను దృష్టిలో పెట్టుకుని కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత వైసిపి ప్రభుత్వానిదేనన్నారు.

ఆర్థికంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద క్షత్రియులను దృష్టిలో పెట్టుకుని క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రథమ ఛైర్మన్‌గా తన తండ్రి పాతపాటి సర్రాజు పని చేయడం, ఆ పదవి తాను చేపట్టబోతుండటం తమకు ఎంతో గర్వకారణంగా ఉందన్నారు.